ప్రియమైన సూర్యం బావకు,

ఊర్మిళ నమస్కరిస్తూ!

కులాసాగాఉన్నావని తలుస్తాను. మేమంతా క్షేమమేను. బహుశా ఈ పాటికి మమ్మల్ని నువ్వు పూర్తిగా మర్చి పోయుండాలి. అందుకే మమ్మల్ని మేం జ్ఞాపకం చేయటం కోసం ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

ఏం బావా! ఈ అయిదు సంవత్సరాల్లోను కనీసం ఒక్క మాటంటే ఒక్కమాటైనా నీకు మేం జ్ఞాపకం రాలేదూ? పట్నంలో జీవితం ఎంత బావున్నా పల్లెటూళ్ళంటే అంత పూర్తిగాపడకి పోవటం బావుండదు. అందులోను పుట్టి పెరిగిన ఇందుపల్లిని— ఆడిపాడిన ఇందుపల్లిని మర్చిపోవటం ఘోరమైన నేరం అవుతుంది సుమా!

ఏ మాటలా ఉంచు... నాకు మాత్రం నిన్నొకసారి అర్జంటుగా చూడాలని కోరిగ్గా ఉంది. "ఎందుకూ?" అనకు, "ఏమో!" అనేస్తాను సమాధానం ఏం చెప్పాలో తోచక. ఈ ఉగాదికి మా వూళ్ళో నాలుగు రోజులు వచ్చి ఉండమని ఆహ్వానిస్తున్నాను. నా ఆహ్వానాన్ని మన్నిస్తావా?

ఉంటాను!

—ఊర్మిళ

పి.ఎస్:— ఇలా నీకు నేను ఉత్తరం వ్రాసినట్లు ఎవరి దగ్గర అనకు అందరూ నవ్వుతారు. నీ అంతట నువ్వే వచ్చినట్లు రా.

# జీవితం మచ్చి



జి.యక్.సూరి

"ఏడవకపోయింది!" అంటూ ఉత్తరం చదవటం ముగించి కాగితాన్ని మడిచి ప్రక్కన పడేశాడు సూర్యం.

అంతవరకూ ఏదో నవల్లో రొమాంటిక్ సన్నివేశం చదవటంలో మునిగిపోయిన సూర్యం జతగాడు సుబ్బారావు తలెత్తాడు చివరి మాటలు వింటూ.

సూర్యం మొహం చిటపటలాడటం చూసిన సుబ్బారావు— "ఎందుకురా అబ్బీ! మొహంఅదోలా పెట్టావ్? అస్తమానూ డబ్బు కోసం రాస్తే వీపు చిట్లేస్తానన్నాడా మీ నాన్న? లేకపోతే నువ్వు రాసిన లౌ లెటర్ తీసుకెళ్ళి ప్రిన్సిపాల్‌కిస్తానందా బి జెడ్.సి. పద్మ? ... అదేమిటో చెప్పి మరీ ఏడు ... అలాకాకపోతే ఏడ్చేసి ఆ తర్వాత చెప్పు!" అన్నాడు.

సూర్యం ఉరిమి చూశాడు సుబ్బారావు వైపు. దాంతో సుబ్బారావు కంగారుపడి— "సరేలే ఏడుస్తానే చెప్పు" అన్నాడు.

సూర్యం మళ్ళీ కోపంగా చూడబోయ్యాడు కాని సుబ్బారావు అలా చూసినకొద్దీ వంకరటింకరగా మాట్లాడతాడని తగ్గిపోయాడు.

సూర్యం మాట్లాడకుండా వూరుకునేటప్పటికి సుబ్బారావుకి జాలేసింది. "ఒరేయ్ సూరీ! ప్రతీ దానికి అలా డీల అయిపోతే ఎలారా? బొత్తిగా ఆడపిల్లలా తయారవుతున్నావస్మీ. నాతో చెప్పకూడని కష్టమా అది?" అన్నాడు వోదార్పుగా.

"సుబ్బీ! .. ఇది చూడరా ..." అంటూ ఊర్మిళ వ్రాసిన ఉత్తరం సుబ్బారావుకి అందించాడు సూర్యం.

సుబ్బారావు మాట్లాడకుండా సూర్యం అందించిన ఉత్తరం తీసుకున్నాడు. శ్రద్ధగా ఉత్తరాన్ని చదివి ఫక్కుమని నవ్వుతూ— "ఇదేమిట్రా వెంగళాయి! ఆడపిల్ల ... అందునా వరుసైన పిల్ల ముద్దుగా—ముచ్చటగా ప్రేమలేఖ వ్రాస్తే ఏడుపు ముఖం పెడ్తావ్? అయినా ఇంతకూ నాకు తెలియక అడుగుతాను . . నీకో మరదలున్నట్లూ. పైగా ప్రేమలేఖ వ్రాసే ఈడుదైనట్లు నా కెప్పుడూ చెప్పలేదేం?" అన్నాడు.

సూర్యం రెండు క్షణాలు మాట్లాడలేదు.

సుబ్బారావు పరిశీలనగా సూర్యం మొహంలోకి చూడసాగాడు.

"హోరేయ్ సుబ్బీ! ప్రమాదం పీకల మీదికొచ్చి కూర్చుంటే పరిహాసాలాడతావేమిట్రా?... అది మరదలా? .. దాన్ని గురించి మరొకరితో ముచ్చటించేపాటి అదృష్టం కూడానా? లేదురా...

బాబూ ! లేదు. [illegible] సుబ్బిగా ! నువ్వెప్పుడైనా తాటకీ—శూర్పణఖాలాంటి పేర్లు విన్నావా ? . . . సరిగ్గా ఆ కోవకి చెందినదిరా ఈ ఊర్మిళ. ఊర్మిళట ! ఊర్మిళ ! గొంగళిలా మొహం అది. వోరేయ్ ! ఆ పేరుకు తగ్గట్టు దాని మొహం కూడా నిద్ర మొహమేరా సుబ్బీ . . ."

సుబ్బారావుకి సూర్యం చెప్పేది ఒక్కటికూడా తలకెక్కటంలేదు.

అంతా విని "నాకేం అర్థం కావటం లేదురా అబ్బీ ! . . . ఆ చెప్పేదేమిటో సరిగ్గా చెప్పేడవ రాదూ ?" అన్నాడు ఏళ్ళు మండి.

"అర్థం అవ్వదురా . . . అంత సులభంగా అర్థం అయితే నీది మట్టి బుర్ర ఎందుకవుతుంది ?" సూర్యం వెక్కిరింపుగా అన్నాడు.

సుబ్బారావు మొహం చిన్నబుచ్చుకుంటూ— "నా బుర్రను గురించి నీ కాంప్లిమెంట్స్ తర్వాత పాస్ చేద్దువుగాని కాని . . . ముందు ఊర్మిళ ఎవరో ఆ అమ్మాయి నీకెలా మరదలయ్యిందో . . . ఆంధ్రదేశంలో ఇందుపల్లి ఏ ప్రాంతంలో ఉందో వివరంగా చెప్పి మరీ అఘోరించు. అలా కాదన్నావో . . . . నీకెవరో ఊర్మిళనే పిల్ల తో లెటర్ రాసినట్లు బి.జడ్.సి. పద్మకు చెప్పెయ్యనీ" అన్నాడు.

చివరి మాటలు వింటూ ఒక్కమాటుగా ఉలిక్కిపడ్డాడు సూర్యం.

"సుబ్బీ . . . ఆ పని మాత్రం చేయకురా నీకు పుణ్యం ఉంటుంది. ఇంతకు ఊర్మిళ గురించే కదా నీక్కావల్సింది. చెప్తాను ! కాని . . . నువ్వో మాటివ్వాలి. పద్మ దగ్గర ఊర్మిళ వూసు మాత్రం ఎప్పుడూ ఎత్తకూడదు. నీకు తెలుసుగా పద్మ నా ఎడం గుండెకాయని ?" కన్నీళ్ళు చినహోగా సుబ్బారావుని బ్రతిమాలసాగాడు సూర్యం.

సుబ్బారావు అందుకున్నాడు.

"తెలియకేం ? . . . అన్నీ తెలుసు ! ! సరళ నీ కుడి గుండెకాయనీ . . . సరోజ నీ ఆరో ప్రాణమనీ . . . మీనాక్షి నీ మనుగడనీ . . . ఇంకో పేరు చెప్పే వాడివి . . . అదేమిట్రా ?" జ్ఞాపకం రాక ఆగిపోయాడు.

సూర్యం టక్కున అందించాడు— "అరుణ !" అంటూ.

"ఆఁ ! . . . అరుణదీ నీది ఒకే బాట . . . ఒకే మాట అనీ . పూర్తిగా తెలుసురా అబ్బీ ! . . . కాకపోతే నీ లిస్టులో ఊర్మిళనే మరో ప్రేమదేవత పేరు కూడా చేరబోతున్నట్లు ఇప్పుడే తెలిసింది. అయినానరేరా ! ఇంతమందికి మనసిచ్చి పుచ్చుకోటానికి నువ్వేమన్నా గోపాలకృష్ణుడనుకున్నావ్రా ? మీ నాన్నకు తెలిస్తే వీపు చిట్లిపోతుందస్మి ! . . . ఆ అమ్మాయిలకు తెలిసినా అదే జరుగుతుందనుకో !" అన్నాడు సుబ్బారావు మందలింపుగా.

సూర్యం మాట్లాడలేదు. తలొంచుకుని కూర్చున్నాడు.

సుబ్బారావు స్నేహితుడి భుజం మీద చేయి వేసి— "అయినా సూరీ ! నిక్షేపంలాంటి మరదలుండగా నీకివేం బుద్ధుల్రా ? నోరార "బావా !" అని ముద్దుగా పిలుస్తోన్న అమ్మాయిని కాదని "రవుడీ ! . . . రాలుగాయి అంటున్న వాళ్ళ జోలికెందుకు పోతావురా ? . . . నా మాట విని ఊర్మిళ సంగతి ఆలోచించు శ్రద్ధగా" అనునయంగా అన్నాడు.

సూర్యం సూటిగా సుబ్బారావు కళ్ళల్లోకి చూశాడు. ఇప్పుడో కాసేపట్లోనో ఏడుస్తామన్నట్లున్నాయి ఆ కళ్ళ తీరుచూస్తే. సుబ్బారావుకి భయమేసింది స్నేహితుడే క్షణంలో బేరుమంటాడోనని. అంత పని జరిగింది. ఎటొచ్చి ఏడుపు మినహాయింపుగా బొంగురుపోయిన గొంతుకతో— "సుబ్బీ ! మరదళ్ళంటే నాకు మాత్రం ముచ్చట లేదనుకున్నావుట్రా ? సరైనా మరదలే ఉంటే నేనిలా "పద్మా ! సరళా" అంటూ వూరి వాళ్ళమీద పడుదునా ? . . . ఊర్మిళ మరదలు కాదురా . . . రాక్షసి ! నువ్వెప్పుడూ దాన్ని చూడలేదు కాని చూస్తే నన్నిలా శూలాల్లాంటి మాటలతో బాధించేవాడివికాదు. తెలుసా ?" అనడిగాడు.

సుబ్బారావు వెంటనే— "ఏం? అసలా అమ్మాయి నీకెందుకు చేదయింది ? అందంగా ఉండదా ? ఆ మాటకొస్తే నువేమంత పెద్ద అందగాడివి ? . . . గుణం మంచిదికాదా ? అదే అయితే నువేమంత గుణవంతుడివి ? . . . వోరేయ్ సూరీ ! . . . అమాయకురాలైన ఓ ఆడపిల్లని రొప్పు పెడుతున్న నువ్వురా . . . నువ్వు రాక్షసుడివి" అంటూ కోపంగా విరుచుకు పడిపోయాడు సూర్యం మీద.

సుబ్బారావు రొప్పడం మానే వరకూ మవునంగా వూరుకున్నాడు సూర్యం. తర్వాత పది నిముషాలకు సుబ్బారావు పూర్తిగా రొప్పడం మానేసి తోటకూర కాడల్లే వాడిపోయిన మొహంతో కుర్చీలో జార్లపడి కూర్చున్నాడు.

సూర్యం ప్రారంభించాడు. "సుబ్బీ ! అయినదానికీ . . . కాని దానికీ హైరాణ పడిపోవడం నీకీ మధ్య బాగా అలవాటయిపోయిందస్మి. అది కాస్త నువ్వు తగ్గించుకోవాలి. పోతే . . . ఊర్మిళ నాకు నచ్చకపోతే మధ్య నీకేమిట్రా కోపం ? . . ."

"కోపం కాదు . . . బాధ !" నీరసంగా జవాబిచ్చాడు సుబ్బారావు.

"ఎందుకూ ?" అడిగాడు సూర్యం.

"ఒక ఆడ కూతురి మనసు నొప్పిస్తున్నందుకు . . . అదీకాక వలచి వచ్చే పడతిని కాదంటున్న నీ తెలివి తక్కువతనం చూసి !" సుబ్బారావు మామూలు మనిషి అవుతున్నాడు.

సూర్యం పెద్దగా నిట్టూర్చాడు. ఆ తర్వాత బరువుగా వూపిరితీసుకున్నాడు. "సుబ్బీ ! ఊర్మిళ అంటే నాకు ససేమిరా ఇష్టం లేకపోవటం ఎందుకో తెలుసా ? . . . అది ఏనాడు నన్ను మనిషిగా చూడలేదురా ! . . . ఈ మాటలు పూర్తిగా అనుభవంతో చెప్తోన్నవి . . ."

సుబ్బారావు మధ్యలో ఏదో మాట్లాడపోతే— 'నువ్వాగరా అబ్బీ ! పూర్తిగా నే చెప్పేది విను సందేహాలుంటే తర్వాత అడుగు. తీరుస్తా !' అన్చెప్పి "ఊ ! ఏం చెప్తున్నానూ ? ఊర్మిళ నన్ను మనిషిగా

## పెళ్లి చూపులు

వస్తున్నారమ్మా వస్తున్నారు
పెళ్లిచూపులకు వస్తున్నారు
అక్కను వాళ్ళు చూస్తారంట !
బావగారి రేటు, చెపుతారంట ! !
డాక్టరు బాబుకు '70' వేలు !
ఇంజనీరుకు '20' వేలు !
భూస్వాములవారికి '40' వేలు . . .

వెళ్తున్నారమ్మా వెళ్తున్నారు !
అక్కను వాళ్ళు చూశారంట !
బావకు పిల్ల నచ్చిందంట.
కట్నము అసలే వద్దంట
ఆడబిడ్డ లాంచనాలు చాలంట.

"అవి" అంతా కలసి ఎంతోకాదు,
అన్నీ కలసి '60' వేలు
అతిగా ఆశలు లేవంట

పెండ్లికుమారునికీ, స్కూటర్ వారి
అత్తమామలకు, ఆడబిడ్డలకు,
అతి స్వల్ప లాంచనాలంట

వెళ్తున్నారమ్మా వెళ్తున్నారు
పెళ్లిచూపులకు వచ్చి వెళ్తున్నారు
అక్కకు పెళ్లి వద్దమ్మా
హాయిగ మనతో ఉంటుందమ్మా ! ?

కె. విజయకుమారి.

చూడని సంగతెగా ? అవునురా సుబ్బీ ! . . . నా హైస్కూలు చదువంత అమలాపురంలోనే జరిగింది. మా మావయ్య అప్పుడు ఇందుపల్లిలో ఉంటూండేవాడు. వాళ్లింట్లో ఉండి రోజూ మూడు మైళ్ళు అమలాపురం వెళ్లి చదువుకొచ్చేవాణ్ణి. మా నాన్నగారు అప్పుడు రాజమండ్రిలో ఉండేవారనుకో. అక్కడే ఉద్యోగం ! అయితే రాజమండ్రిలో చదవక మధ్యలో అమలాపురంలో ఏమిటంటావ్ ? అవునా ? నాకు అప్పట్లో మేనమామలంటే మహా ఇష్టంగా ఉండేది. పైగా పల్లెటూళ్ళంటే అదో రకమైన మోజు కూడా ఉంది. కారణం ఏమను . . . పరాయింట్లోన ఉండి చదవటం అంటే హాస్టల్లో ఉండి చదువుకోవటంలాగే ఫీలయ్యేవాణ్ణి. అదో సరదా !" అంటూ మధ్యలో వూపిరితీసుకోడానికన్నట్లు క్షణంసేపు ఆగాడు సూర్యం

ఆ క్షణం సేపుని వినియోగించుకొని— "ఈ సొదంతా ఎందుకురా సూరీ ? సంగతేదో మూడు ముక్కల్లో తేల్చిపారేయ్ బావుంటుంది" అన్నాడు

"ఆఁ ! ఆఁ ! వచ్చేస్తున్నాను మా ఇందుపల్లి మావయ్య కూతురన్నమాట ఊర్మిళంటే

మావయ్య సంతానంలో వూర్మిళే పెద్దది. మనిషి నల్లగా బొగ్గు ముక్కలా ఉంటుంది. దానికి సాయం ఎడ్డితనం అంతా దాని మొహాన్నే తాండవం చేస్తూంటుంది. వోరేయ్ సుబ్బీ! పైగా అదెంత రాక్షసో తెలుసా? అస్తమానూ నన్ను ఉత్తి పుణ్యానికి తిట్టిపోస్తూండేది. పితూరీలు చెప్పి మా ప్రైవేటు మాష్టారి చేత కొట్టించటం కూడా చేసేది. రాక్షసిరా బాబూ! అందుకే అప్పట్నుంచి ఇప్పటివరకూ అదంటే నాకు మంట. అది మహా అందంగా ఉండేడిసినట్లు నన్ను పట్టుకుని "కోతి బావా! కోతి బావా!" అంటూ వేళాకోళం చేసింది. కాకిపిల్ల కాకికి ముద్దన్నట్లు మా మావయ్యా—అత్తయ్యా ఒకటే నవ్వేవారు దాని వాగుడికి మురిసిపోతూ. నాకు భలే మంటగా ఉండేదిలే... అదేమిట్రా! తల పట్టుక్కూర్చుంటావ్? అంత బోర్ కొడ్తోందా? అయినా

# జీవితం రుచి

వోరేయ్! ఊర్మిళ గురించి చెప్పమని నువ్వేగా అడిగావ్?... పైగా ప్రాణాలు పోతోన్నట్లు వెధవ ఫోజు ఒకటా?... సరే అయిపోవచ్చిందిలే... ఆఁ! నన్ను గురించి మా వీధి ఆడపిల్లలందరి దగ్గర దండోరా వేసేదిరోయ్! రవుడీననీ... ఆడపిల్లల్ని ఏడిపిస్తానని... తనకి లౌ లెటరు రాసానని... ఒట్టుగా ఆ మూడో పని మాత్రం నేనెప్పుడు చేయలేదు. అయినాసరే దానికదో గ్లామరు. ఎప్పుడైనా దాని అల్లరి హద్దుమీరి ఉక్రోషం పట్టలేక అత్తయ్యకీ— మావయ్యకీ చెప్తే "పోనిద్దూ అంటే అంది... కాకపోయినా నీ పెళ్ళామే కదట్రా అంటూాంట. దానికంత ఉడుకుమోత్తనం ఎందుకు?" అనేవారు. అదిరా బాబూ కథ! ఈ ఉచ్చు నా మెడ చుట్టూ అప్పట్నుంచే బిగించటం మొదలుపెట్టారు. ఆ బ్రహ్మ రాక్షసినీ.. సివంగిని నాకు కట్టపెట్టాలని వాళ్ల ప్లాను. అందుకే హటాత్తుగా ఈ ఉత్తరం వూడిపడింది. వోరేయ్ సుబ్బీ! ఆ ఉత్తరం రాస్తోన్నట్లు వాళ్లందరికీ తెలుసురా... అయినా దానంతట అదే రాసినట్లు చిన్న నాటకం! ఇదంతా మా అత్తయ్య ఏర్పాట్లే. కుర్ర వెధవ! పట్నంలో ప్రేమ సినిమాలు చూసి చూసి ఉంటాడూ.. ప్రేమ కథలు చదివి చదివి ఉంటాడు. ఇంతోటి బోడి లౌ లెటరుకి ఉబ్బిపోతాడూ... అనుకుని ఉంటారు. అమ్మో!... ఎంత ప్లాను!! నేను పడ్తానా?" ఏక బిగిని వాగి చివర్న చిన్న ముక్తాయింపు ఇచ్చి ఆపాడు సూర్యం.

"హమ్మయ్య!" అనుకున్నాడు సుబ్బారావులోపలే.

"ఇప్పుడు చెప్పరా సుబ్బీ! ఆ రాక్షసినీ... రణపెంకిని ఎలా చేసుకోమంటావ్? అదంటేం నాకు మహా చెడ్డ ఎలర్జీరా బాబు... అంతకన్నా సెకెండ్ ఇయర్‌లో ట్యూబ్ లైట్ అంటారే సావిత్రి అనే పిల్ల!... ఆ అమ్మాయిని కట్టుకోవటం రైటు!... అహ! మాటవరుసకంటున్నాననుకో... నేనేలాగూ పద్మని చేసుకుందుకు నిర్ణయించుకున్నానులే! అది వేరే సంగతి" అంటూ పద్మని గురించి వన్ సెకన్ కల కనటంలో లీనమయ్యాడు సూర్యం.

సుబ్బారావు సూర్యాన్ని భుజం తట్టి కలనుంచి మెల్కొలిపాడు. "సూరీ!... నీది బొత్తిగా డ్రీమ్ లాండ్‌రా! పద్మ నీకు ఎలా అందుతుందనుకున్నావ్? దీపంలాంటి పిల్లని ఆశపడుతున్నావేమో?... ఆ ఆశ ఎక్కువైతే చేయి అంటుకుంటుంది జాగ్రత్త!"

సూర్యానికి కోపం వచ్చింది— "అంటే?... అంటే నీ అభిప్రాయం?" ఉక్రోషంతో నిండిన కంఠంతో అడిగాడు.

"అంటేనా? వెర్రి మొర్రి ఆశలకు పోక మీ మావ కూతురు ఊర్మిళని పెళ్లాడమంటున్నాను... హాయిగా ఉండమంటున్నాను. అయినా సూరిగా!.. ఒక మాట అడుగుతాను... ఊర్మిళని నువ్వు చూసి ఎన్నేళ్లవుతోంది?"

"అదే రాసిందిగా!... అయిదేళ్లు!!"

"అలాగా?... అయితే అప్పటి ఊర్మిళ వయస్సెంత?"

"పదకొండు!.. అయి నాఇవన్నీ ఎందుకురా?"

సుబ్బారావు మనసులోనే ఏవేవో గుణించాడు— తీసివేశాడు. రకరకాల కేలుక్లేషన్స్ అయిన తర్వాత — "వోరేయ్ అమాయకుడా!... ఎప్పుడో చిన్నప్పుడు చూసిన ఊర్మిళని మనసులో ఉంచుకుని ఎంత తెలివి తక్కువ వాడవవుతున్నావురా! ... నా మాట విని ఇప్పుడు వెళ్లు... ఊర్మిళ చాలా మారిపోయుంటుంది. నీకు చాలా నచ్చేలా కూడా ఉండొచ్చు" హితోపదేశం చేశాడు సూర్యానికి

సూర్యం సుబ్బారావు మాటలు తీసేస్తూ చిన్నగా నవ్వాడు

(38 వ పేజీ చూడండి)



# యువతరం

ఇరవై సంవత్సరాల బొప్పా వెంకటేశ్వరరావు కాలేజీ ఏక్టివిటీస్‌లో ముందుండాలను



కుంటూనే, గేయాలు అవీ నిర్విరామంగా రాస్తూంటాడు. పత్రికలో సినిమా వార్తలు ముందు చదువుతాడు. కాని సినిమా తారలను చూడాలన్న సరదా లేదన్నాడు. కానీ వారిని, అలాగే మంత్రుల్నీ కూడా కొన్ని సందర్భాల్లో కలుసుకున్నాడు. ఆంధ్రోద్యమంలో పాల్గొన్నప్పుడు చూడ్డమే మంత్రుల్ని. ఆ తర్వాత కలుసుకోలేదు. సమస్యాత్మక చిత్రాలు తప్పక చూసే, యీ యువకునికి లైబ్రరీకి వెళ్లే అలవాటు లేదు. ఆటల విషయం అడిగితే వాళ్ల కాలేజీ (విజయవాడలో ఒకటి) కి ప్లేగ్రౌండే లేదన్న సంగతి చెప్పాడు. కవి సమ్మేళనం, నాటకం, లాంటి వాటిలో పాల్గొనటం చాలా చాలా సర్దా — నటుడిగా రాణించాలని కూడా ఆశ వుంది. భవిష్యత్‌లో పరిశ్రమలు స్థాపించాలన్న పెద్ద కోరిక కూడా వుంది. "తాగావా ?" అన్న ప్రశ్నకు "తాగుడు అలవాటు లేదు" అని జవాబు యిచ్చాడు. దేశంలో ధరలు పెరిగి పోటానికి అతని ఉద్దేశంలో కారణాలు, ఉత్పత్తి చాలినంత లేదు. — జనాభా పెరుగుదల ఎక్కువైంది, ఉత్సాహం, బోలెడు ఆశలు వున్న యీ యువకుడు బి. కాం. ఫైనలియర్ చదువుతున్నాడు. ఆశలను జాగ్రత్తగా ఏరుకొని ఆశయాలుగా మల్చుకుంటే తప్ప ముందుకు పోలేని తొలి మలుపులో నిలబడి వున్న యితనికి, యితని లాంటి యువకులకి రాజకీయాల ప్రవేశం మంచిదా ? అన్నది ప్రశ్న. ఎందుకంటే వెంకటేశ్వరరావు "రాజకీయాలలో ప్రవేశం వున్నది" అని యిప్పుడే అన్నాడు గనుక.

— కృష్ణానంద్

## జీవితం రుచి

(14 వ పేజీ తరువాయి)

"ఏం మారుతుందోయ్ ? నా తలకాయ ! . . . హటాత్తుగా దాని నలుపు పోదుగా ? అలాగే దాని పెంకితనం కూడా తరిగిపోదుగా ? ఇవన్నీ ఇలా ఉంచు. చదువు సంధ్యా లేని దాని పల్లెటూరు వాలకం ఎక్కడికిపోతుంది? నువ్వెన్ని చెప్పు సుబ్బిగా ! నేను మాత్రం దాన్ని చేసుకోను. తర్వాత మరో సంగతి ! ఈ ఉగాదిలోపుగ పద్మ విషయం తేల్చేస్తాను. ఫైనలియర్ అవుతుండగానే మూడు ముళ్లూ వేసేస్తాను. అంతే !"

సుబ్బారావు మరి మాట్లాడలేదు.

సూర్యం అంతిమ విజయం తనదే అయినట్లు మరోసారి నవ్వాడు చిన్నగా. పూర్ణిమ వ్రాసిన ఉత్తరం అందుకుని దానికేసి వోమాటు నిర్లక్ష్యంగా చూసి ముక్కలుగా చింపి కిటికీ బయటకు గిరాటేశాడు.

సుబ్బారావుకి చాలా బాధ కలిగింది.

"వొరేయ్ సూర్యం ! . . ఒక్క మాట . . . పోనీ పూర్ణిమని చేసుకోకపోతే పోని. కాని ఒక్కమాటు ఇందుపల్లి వెళ్లి ఆ అమ్మాయి కోరిక తీర్చకూడదూ ?" అడిగాడు.

"ఎందుకూ ?—" అన్నాడు సూర్యం.

"ఎందుకేమిటి? ఆ అమ్మాయి మనసు కష్టపడకుండ ఉండేటందుకు. అదీ కాకుండా నువ్వెళ్లి ఆ అమ్మాయికి సూటిగా ఏ సంగతీ చెప్పేయ్యొచ్చు. లేకపోతే చివరిదాక ఆశలు పెంచుకుంటూనే ఉంటుంది".

సూర్యానికి ఈ మాట నచ్చింది. "బాగానే ఉంటుందికూడా . . . అదీకాక చిన్నప్పుడంతా తన నేడిపించిన ఫలితానికి ఈ తిరస్కారంతో పూర్ణిమని బాగా ఏడిపించవచ్చు. అది కళ్లారా చూడొచ్చు. అయితే అయ్యిందికాని ఈ వెధవ సుబ్బిగాడు మంచి అయిడియా ఇచ్చాడన్మే."

సుబ్బారావు సూర్యం ఏం చెప్తాడోనని ఆత్రతగా చూడసాగాడు. రెండు మూడు నిముషాలు మవునంగా ఉన్న తర్వాత— "అయితే వెళ్లమంటావా ?" అనడిగాడు సూర్యం.

చివరిసారిగా చిన్న బెట్టు చూపిస్తున్నాడని గ్రహించాడు సుబ్బారావు . . .

"అప్పన్నా పాపం ! . . . ఒక మాటు వెళ్లొస్తే ఏం పోయింది ?" జాలిగా అన్నాడు సుబ్బారావు.

"సరే ! . . ." అన్నాడు సూర్యం.

"రైటో !" అనుకున్నాడు మనసులోనే సుబ్బారావు. కొంతవరకూ ఇది అతనికి ఆనందం కలిగించింది.

* * *

రైలుమీద, బస్సు మీద, పడవమీద ప్రయాణం చేసి సూర్యం ఊర్మిళ వాళ్ల వూరు ఇందుపల్లి చేరుకున్నాడు. సూర్యం చిన్నప్పుడు ఆ వూళ్లో రిక్షాలు ఉండేవికావు. ఇప్పుడు ఒకటో అరో సైకిలు రిక్షాలు తిరుగుతూ కనిపించాయి. కాలువ గట్టున రిక్షాలో వస్తూంటే చిన్నప్పటి సంఘటనలు ఎన్నో జ్ఞాపకం వచ్చాయి.

అప్పట్లో తనతో తిరిగిన ఇద్దరు ముగ్గురు స్నేహితులు కూడా కనిపించారు. సూర్యం మనసు ఒక రకమయిన అనుభూతికి గురైయ్యింది.

రిక్షా వూళ్లోకి ప్రవేశిస్తుండగా చెరువుగట్టున నలుగురైదుగురు అమ్మాయిలు నీళ్ల బిందెలు చంకన పెట్టుకుని వస్తూ కనపడ్డారు. "వీళ్లలోగాని లేదుకదా ఊర్మిళ ?" అనుకున్నాడు సూర్యం.

ఆ నలుగురైదుగురమ్మాయిలు చాలా ఆరోగ్యంగా— అందంగా కనపడ్డారు సూర్యానికి.

"ఈ మాత్రం అందం కూడానా పూర్ణిమకి ?" మరోమాటు ఈసడించుకున్నాడు సూర్యం.

రిక్షా మేనమామ ఇంటి ముందు ఆగగానే సూటుకేసు అందుకుని దిగాడు. రిక్షాకు డబ్బిచ్చి గుమ్మంలోనుంచుని "అత్తయ్యా !" అన్నాడు మెల్లగా. ఎవరూ పలకలేదు. అలాగే కాసేపు నిలబడిపోయాడు సూర్యం.

"ఎవరు కావాలండీ ?" అని సన్నని కంఠం వినపడి వెనక్కి తిరిగి చూశాడు సూర్యం.

సూర్యం కళ్లు జిగేలుమన్నాయ్ ! . . . అందమైన బొమ్మని నిలబెట్టినట్లు వయ్యారంగా చంకని బిందె పట్టుకుని నిలబడుందో అమ్మాయి.

సూర్యాన్ని చూస్తుండగానే ఆ అమ్మాయి సిగ్గుపడి— "వొ ! బావా ? . . ." అంటూ లోపలికి వెళ్లిపోయింది కంగారుగా.

"ఊర్మిళా !" అనుకున్నాడు ఆశ్చర్యంగా సూర్యం.

అతనికేదో కలలో చూస్తున్నట్లుగా ఉంది. ఊర్మిళకి ఇంత అందం ఎక్కణ్ణుంచి వచ్చిందబ్బా ? చిన్నప్పటి నలుపు నలుపుగానే ఉంది . . . కాని . . . ఆ నలుపులో వింత కాంతివచ్చి చేరిందే కొత్తగా. ఊర్మిళ ఇంత అందంగా సిగ్గుపడటం తనెప్పుడూ చూడలేదే ? . . . ఎక్కణ్ణుంచి వచ్చి చేరాయి ఈ కొత్తదనాలూ ? సూర్యం ఆలోచనలు కెరటాలై ముంచెత్తుతున్నాయి.

"రావోయ్ అల్లుడూ ! . . . ఎన్నాళ్లకి జ్ఞాపకం వచ్చాం ! . . . దారి తప్పలేదు కదా ?" అత్తయ్య ఆహ్వానం సూర్యాన్ని ఆలోచన్లనుంచి ఇవతలకి తెచ్చింది. అంటే పూర్ణిమ ఉత్తరం సంగతి వీళ్లెవరికీ తెలీదన్నమాట !

"వూం ! . . . అబ్బే . . . దారి తప్పటం ఏమిటి ?" సూర్యానికి మాటలు తడబడ్డాయి. సూటుకేసుతో సావిట్లోకి అడుగుపెట్టాడు సూర్యం.

"ఊర్మిళా ! . . బావకు కాళ్లు కడుక్కోటానికి నీళ్లు తెచ్చియ్యి" అంటూ కేకేసింది సూర్యం మేనత్త.

సూర్యం, ఏవైపు నుంచి వస్తుందా అన్నట్లు చూడసాగాడు. అది కూడా పరాగ్గానే.

"కాళ్లు కడుక్కో బావా !" సరిగమలు పలికింది.

దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము



వరిబీజం (బుడ్డ), హెర్నియా, మూత్రవ్యాధులు, అప్పటి నర ముల బలహీనతచే అంగము దిస్సదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్ల నష్టము, నపుంసకత్వము ఆపరేషన్ లేకుండాచేయబడును.

స్వయంగా రండి.

శ్రీ బాలాజీ వైద్యశాల, డా. దేవర,
టి. బి. రోడ్, ఫోన్ : 551, తెనాలి.
బ్రాంచి : 9—డి, శివాజిస్ట్రీట్, మద్రాసు—17.


# జీవితం రుచి

ఊర్మిళ కంఠం. సూర్యం ఆమెటువైపు నుంచి వచ్చిందీ గమనించేలేదు.

ఊర్మిళని పలకరించాలని అతని ప్రయత్నం. అ దేలాగో చేతకావటంలేదు. అతని తీరు అతనికే ఆశ్చర్యంగా ఉంది. కాలేజీ అమ్మాయిలు కనిపిస్తే చాలు ఏదో ఒక వంకని నిర్భయంగా పలకరించే తను ఏమిటి ఇలా అయిపోతున్నాడు ? ఊర్మిళలో ఈ కొత్త రకం శక్తి . . . అదే మాటలు రాకుండా మూగవాళ్ళను చేసేది ఎక్కణ్ణుంచి వచ్చిందీ ? ఈ ఆకర్షణ ? ఈ అందం ? ఈ కొత్తదనం ఎక్కణ్ణుంచి వచ్చాయి. ఊర్మిళకి ఏ దేవతః ఇవన్నీ కానుకగా ఇచ్చారు ?

"బావా ! . . ." ఊర్మిళ మళ్ళీ పిలిచింది.

ఉలిక్కిపడి పూర్మిళ చేతిలో నీళ్ల చెంబు అందుకున్నాడు. పూర్మిళ వేలి కొసలు తగిలాయి: విద్యుత్ ప్రవహించింది రాకిడికి. ఏమిటీ అనుభవం సూర్యానికి ఏం అర్థం కాలేదు.

రెండు మూడ్రోజులు గడిచేసరికి పూర్మి మాటల్లోనూ— చేతల్లోనూ చాలా అందమైన మార్పులు గమనించాడు సూర్యం. అంతకుముంద ఆమెలో చూడని కుదురుతనం చూచాడు సూర్యం అతనికి ఆమెవలన ఎన్నడూ అనుభవంలేని మృదువైన — మధురమైన మర్యాద చవిచూశాడు మాటలు పొందికగా మాట్లాడటంలో ఆమెలో కొత్త సౌందర్యాలు చూశాడు. పూర్వపు పెంకెతనం— మంకుతనం ఏవీ ఆమెలో కనపడలేదు సూర్యానికి.

సూర్యం ఎంత కాదనుకున్నా ఇదేలా సంభవం అనిపించే ఆలోచన్లు చుట్టుముడుతూనే ఉన్నాయి ఒక క్షణములో అయితే పూర్మిళనే అడిగితే. అనిపించింది.

ఆదీ జరిగిపోయింది.

ఉగాది రోజు ఉదయాన్నే సూర్యానికి ఉగాది పచ్చడి తెచ్చింది పూర్మిళ. ఆ సమయంలో ధైర్యం తెచ్చుకొని— "అపురూపని పూర్మిళా ! . . . ఇప్పటి నీ కుదురుతనం— మర్యాదా మున్నా చిన్నప్పు డుండేవికావే ? . . . అంత రణపెంకెల ఉండి నన్ను ఆట పట్టించేదానివే . . . పాట


## మూడు వందలు లేక నాలుగు వందలతో కుటీర పరిశ్రమ

జీవితానికి కావలసిన అత్యవసరమైన వస్తువుల ధరల పెరుగుదల మూలంగా బీద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత వృత్తితోపాటు సహాయకారిగా మరొకపని ప్రారంభం చేయనిదే జీవితాన్ని నెట్టుకురావడం కష్టం. తెలుగుభాషలో రెండు పుస్తకాలు పబ్లిషర్ ప్రచురణ చేసి మార్గం చూపారు. కుటీర పరిశ్రమలద్వారా ఏ విధంగా లాభాలు పొందుతుదీ వివరంగా ఇవ్వ బడినవి. స్త్రీలు, పిల్లలు ఈ పరిశ్రమలను తేలికగా పడవగలరు. ముడి సరుకు, మెషినరీల వివరములున్నవి. పుస్తకం పేరు "అధునాతన కుటీర పరిశ్రమలు" పేజీలు 640. వెల : రు.23/-. "అన్ని చేతిపనులు" పేజీలు 464. వెల : రు. 20/-. సరిక్రొత్త కుటీర పరిశ్రమ ఇంగ్లీషు పేజీలు 1048. వెల : రు. 25/-. పోస్టేజి రు. 4—00.

Cottage Industry (PWT-1) P.B. 1262, Near Red Fort and Subhash Marg.Behind Recruiting office, DELHI-6, Phone: 262835.



SISTA'S-INC-458 TEL



త్తగా ఈ మార్పు . . . నిజంగా నాకు చాలా ఆశ్చర్యంగా ఉందన్మీ" అనేశాడు.

సూర్యం మాటలు వింటూ ఫక్కుమని నవ్వింది పూర్మిళ.

"చేయి పట్టు బావా ! . . . ఉగాది పచ్చడి తిందువుగాని" అంది సూర్యం అడిగినదానికి సమాధానం చెప్పకుండా.

సూర్యం చేయి పట్టాడు. పూర్మిళ స్పూన్‌తో సూర్యానికి ఉగాది పచ్చడి వేసింది.

"ఎలా ఉంది బావా పచ్చడి ?" అడిగింది పూర్మిళ సూర్యం తినగానే.

"బావుంది. రకరకాల రుచులు ! పుల్లగా, తీయగా, వగరుగా, చేదుగా . . ." సూర్యం చెప్తోంటే కిలకిలమని నవ్వింది పూర్మిళ.

పూర్మిళెందుకునవ్విందీసూర్యానికి అర్థంకాలేదు.

"అవునుకాని . . . నేనడిగినదానికి సమాధానం చెప్పనేలేదు" అన్నాడు. పూర్మిళ మరోసారి నవ్వింది. అందంగా ! అదేమిటి బావా ! . . . నీచేతే చెప్పించాగా సమాధానం !" అంటూ అక్కణ్నుంచి పరుగున వెళ్ళిపోయింది.

పూర్మిళ అన్న మాటలు సూర్యానికిమాటు అర్థంకాలేదు. తనంతకు ముందు అన్న మాటలు మళ్ళీ నెమరేసుకోసాగాడు. "పుల్లగా, తీయగా, వగరుగా" సూర్యానికి పూర్మిళ సమాధానం తెలిసిపోయింది.

"అవునన్మీ ! . . . పొగరూ . . . పెంకితనం . . . మంకుతనం . . . మర్యాదా . . . మన్ననా,అన్నీ ఉగాది పచ్చడిలాగే కలిసి ఉంటే బావుంటాయి. అదో రకమైన అందం కూడానూ." సూర్యం సుబ్బారావుకి ఉత్తరం రాసేందుకు కాగితం కలం తీసుకున్నాడు.

ఒరేయ్ సుబ్బీ !

నీ సలహాకు చాలా థాంక్స్ !


ఊర్మిళ ఈ రోజు ఉగాది పచ్చడి పెట్టింది. తీయగా, పుల్లగా, వగరుగా, చేదుగా చాలా బావుంది. బహుశా అన్ని రుచులు కలిసి ఉండటం వల్లనే కాబోలు ఉగాది పచ్చడి అంత బావుంటుంది.

నా జీవితం కొత్త చిగుళ్ళు వేస్తోంది.

పాత జీవితంలో ఆకులు రాల్చేసింది.

అర్థం అయ్యిందా ? రాళ్ళనుకునేవి రత్నాలవుతాయనీ— మాణిక్యాలనుకున్నవి మసిబొగ్గులవుతాయనీ ఊర్మిళ చెప్పింది. అందుకే అందిన ఊర్మిళని కట్టుకుని అందని ద్రాక్షపళ్ళకు గుడ్‌బై కొడుతున్నాను.

నీ
సూర్యం
అనబడే — సూరిగాడు.



# —అమెరికాలో 'కలకత్తా'—

గత శతాబ్దంనుంచీ అమెరికాలో హత్యలకి రాజధాని అనిపించుకుని, 'అమెరికా కలకత్తా'గా పేరు పొందిన డెట్రాయిట్ నగరంలో ఈ సంవత్సరం

## క్రిస్‌మస్ చావులు 850

ఏప్రిల్‌కి 233 హత్యలు జరిగాయి. క్రిస్‌మస్‌కి ఆ సంఖ్య 850 దాటవచ్చని పోలీసు వారి అంచనా.

నేరాలు జరిగిన దానికన్నా ప్రజలలో భయోత్పాతం పదింతలు ఎక్కువగా ఉందీ నగరంలో. 12 సంవత్సరాల వయస్సుకి పైన ఉన్న ప్రతి వెయ్యి మందిలో 68 మంది దారుణమైన హింసకి గురైన వారున్నారని పోలీసు రికార్డులు సాక్ష్యం యిస్తున్నాయి. గత సంవత్సరం లెక్కలని బట్టి కత్తి పోట్లకి, మానభంగానికి గురైన వారు 90 వేల మంది ఉన్నారు.

డెట్రాయిట్‌లోని భీభత్సాన్ని, భయోత్పాతాన్ని నివారించడానికి ఫోర్డ్ లాంటి వ్యక్తులు కోట్లడాలర్లు ఖర్చు చేశారు.

ఈ నగరంలో పోలీసు వారి రూపురేఖలు, ఆయుధాలు భారీగా మహా యోధుల ఫక్కీలో ఉంటాయి. సంచార శాఖలో ఉండే వారికి చిన్న సైజు టాంకు వంటి ఏర్పాట్లు ఉంటాయి. ఎన్నో రకాల తుపాకులు ఇతర సాధనాలు ఉంటాయి. దుండగులు జరిపే సాయుధ దాడులని ఎదుర్కోనడానికి వీలుగా ఎన్నో ఆధునికమైన విధానాలని అవలంబిస్తారు. అప్పటికీ కొందరు అధికారులు ప్రాణాలని బలి పెట్టాల్సి వస్తూ ఉంటుంది.

ఈ దారుణాలని అరికట్టేటందుకు 'స్ట్రెస్' అనే ప్రత్యేక విభాగం కూడా యిటీవలి దాకా ఉండేది. గత సంవత్సరం చివరి భాగంలో కోల్‌మన్ యంగ్ అనే ఒక నల్లజాతి వ్యక్తి మేయర్‌గా పదవిని అలంకరించాడు. ఆయన పోలీసు శాఖలో మార్పులు తీసుకురావాలని అనుకున్నాడు. పోలీసు శాఖ పునర్వ్యవస్థీకరణలో మొదటి చర్యగా ఈ 'స్ట్రెస్' ని రద్దు చేయడం జరిగింది.

స్ట్రెస్ విభాగం కమాండర్ జేమ్స్ బానన్ అంచనాలని బట్టి గుర్తు తెలియని వ్యక్తుల హత్యలు 20 శాతం జరిగితే, గుర్తు పట్టగలిగే వ్యక్తుల హత్యలు 50 శాతం ఉంటాయట. గంజాయి, నల్లమందు మొదలైన నిషేధించిన మత్తు పదార్థాల వ్యాపారం ఈ గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేయబడటానికి కారణం అయి ఉండవచ్చని బానన్ అభిప్రాయం.

ఈ హత్యలలో 70 శాతం తుపాకులు ఉపయోగించి చేసినవే. 80 శాతం నల్లజాతి వారికి సంబంధించినవే.

## దారుణ హత్యలు 233

కుటుంబంలోని చికాకులు, కలతలు హత్యలకి దారి తీస్తాయని, వాటివల్ల హత్యల సంఖ్య పెరుగుతుందని, నిషేధింపబడిన మత్తు పదార్థాల వ్యాపారం హత్యలు జరగటానికి మరింత దోహదకారి అవుతున్నదని బానన్ అభిప్రాయం. 'డొమెస్టిక్ టాక్స్ ఫోర్స్' అనే ఒక కొత్త విభాగాన్ని పెట్టి ఇలాంటి దారుణాలు జరగకుండా నివారించవచ్చని ఆయన నమ్మకం.

ఈ సంవత్సరం 850 అనుకుంటే పై ఏడు ఐర్లెండ్ హత్యోదంతంలా 1000 హత్యలు జరగవచ్చు. ఐర్లెండ్ సైన్యం ఆధిపత్యం కింద ఉన్న దేశం. ప్రతి వీధిలో ఒక సైనికుని కాపలా పెట్టి హత్యలని తగ్గించుకొన గలిగింది ఐర్లెండ్.

డెట్రాయిట్ నగరంలో కూడా పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే మేయర్ పోలీసుని కాదని సైన్యాన్ని రప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది.

# న వ్వు

—దమ్ము శ్రీనివాసబాబు

నవ్వుతూ గడపాలి జీవితం— ప్రతి
పువ్వులో చూడాలి జీవిత సత్యం.
ప్రతికేది క్షణమైనా
గడియ అయినా, రోజైనా
నవ్వుతూ గడపాలి జీవితం— ప్రతి
పూవులో చూడాలి జీవిత సత్యం.

నవ్వుతూ పరిమళాలు
పువ్వులా వెదజల్లు
రాలినా, గాలిలో కలిసినా
నీ నవ్వే ప్రతిధ్వని
మార్మ్రోగుతుండాలి
నవ్వుతూ గడపాలి జీవితం— అందరినీ
నవ్విస్తూ గడపాలి జీవితం
అప్పుడే విరిసిన మల్లియలా ఉండాలి
కల్మషం లేనట్టి పసివాళ్ళ నవ్వులా
నిండుగా నవ్వేటి బోసి నోటి తాతలా
నవ్వాలి— నవ్వాలి— బ్రతుకంతా నిండుగా
నవ్వుతూ గడపాలి జీవితం— ప్రతి
పూవులో చూడాలి జీవిత సత్యం

ఏదైనా, ఎన్నైనా అడ్డువచ్చినా సరే
లెక్కచేయకుండ సాగు సెలయేటి పరుగులా
కిలకిలా— గలగలా
నవ్వుతూ గడపాలి జీవితం— ప్రతి
పూవులో చూడాలి జీవిత సత్యం.